హైదరాబాద్ వార్త



## బడ్జెట్‌పై ఎవరేమన్నారు?

**విద్యారంగానికి ఆశించిన స్థాయిలో బడ్జెట్ కెటాయించలేదు: ప్రొ.గడ్డం మల్లేశం**



తార్నాక.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి ఆశిసించిన స్థాయిలో నిధులను కెటాయించలేదని అని తెలంగాణ ఆల్ యూనివర్సి టీస్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రొ.గడ్డం మల్లేశం పేర్కొన్నారు. గత ప్రభుత్వం కంటే కేవలం రూ.40 కోట్లను మాత్రమే అదనంగా కేటాయించడం యూనివర్సిటీలకు ఎక్కడ సరిపోవన్నారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించలేదని, విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, రిసర్చ్ కోసం, ప్రాపెక్టుల కోసం, నిధులను కేటాయించలేదని యూనివర్సిటీల అబి.వృద్ధికి రూ. 1000 కోట్లు కెటాయిస్తే బాగుంటుండే అన్నారు.

**అన్ని వర్గాలను నిరాశపరిచిన బడ్జెట్ : ప్రొ.గాలి వినోద్‌కుమార్**



అన్ని వర్గాలను నిరాశపరిచే విదంగా ఈ బడ్జెట్ ఉందని ఒ.యూ ప్రొ.గాలివినోద్ కుమార్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం కూడా బీసీ, ఎస్సీ,ఎస్టీలను నిధులు కెటాయించకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వంద రోజుల ఆరు గ్యారంటీలకే అదనంగా రూ.83 వేల కోట్ల బడ్జెట్‌ను విడుదల చేయాల్సి ఉందన్నారు. కాని ఎక్కడ అది చేయలేదన్నారు. ఓల్డేజ్ పెన్షన్లకు నిధులు కేటాయించలేదన్నారు. విధ్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. యూనివర్సిటీలో అభివృద్ధి మౌలిక వసతుల కోసం బడ్జెట్ కేటాయించలేదన్నారు.

**విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్ద పీట డా.జి.మోహన్‌రావు సామాజిక శాస్త్రవేత్త**



ఈ బడ్జెట్ పూర్తి స్థాయి బడ్జెట్ కాదు ఓటాన్ బడ్జెట్ మాత్రమే అని సామాజిక శాస్త్రవేత్త డా.జి.మోహన్‌రావు పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పూర్తి స్థాయి బడ్డెట్ కాదనే విషయాన్ని గ్రహించాలన్నారు. రైతు బంధు అర్హులైన వారికి మాత్రమే ఇస్తామని చెప్పడం మంచి నిర్ణయం ఇది హర్షించతగ్గ విషయం అన్నారు. కౌలు రైతుకు కూడా రైతు బంధు ఇవ్వడం మంచి పరిణామం అన్నారు.

## పుట్టా రాము హత్య కేసులో కొత్త కోణం

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల యూసుఫ్‌గూడలో జరిగిన పుట్టా రాము మర్డర్ కేసులో మనీ ట్రాప్ తల్లికూతుర్లకు చెందిన కొత్త కోణం బయట పడుతుంది. డబ్బులు ఉన్న పెద్ద మనుషులని ట్రాప్ చేసి దోచుకుంటున్న తల్లికూతుర్లు. ఏకంగా కూతురినే ఎరగా చూపెట్టి బడాబాబుల్ని ఆకర్షిస్తున్న హిమాంబి. కూతురు నసీమాను ఎరగా వేసి మృతుడు పుట్టా రాము అలియాస్ సింగోటంని కొంత కాలంగా లొంగదీసుకున్న వారు రాము వద్ద నుంచి భారీ మొత్తంలోనే డబ్బులు కొట్టేసినట్లుగా సమాచారం. లక్షలాది రూపాయలు ఇచ్చి మోసపోయినట్లు తెలుస్తుంది. తన డబ్బులు ఇవ్వాలని ఇటీవల కాలంలో అడుగుతుండటంతో అతనిని అడ్డు తొలగించుకునే ఉద్దేశ్యంతో రాము సింగోటంను ప్రత్యర్థుల ముందస్తు ప్లానుకు తల్లికూతుర్లు ఒకె చెప్పారు. ప్లాన్ ప్రకారం రాముకి ప్రత్యర్థి మనికంఠ దగ్గర నుంచి డబ్బులు తీసుకుని హనీ ట్రాప్‌కు తల్లికూతుర్లు పాల్పడ్డారు. మనీగ్యాంగ్ నసీమాతో ఫోన్ చేయించి రామును రప్పించారు. నసీమాకోసం వచ్చిన రాము ప్రత్యర్థుల

మిగతా సిటీ 3వ పేజీలో

# మహా నిరాశే!

## మెట్రోకు నై.. జీహెచ్ఎంసికి మొండి చేయి

## ఆరు గ్యారంటీలకు పెద్దపీట • మూసీకి నిధుల వరద



హైదరాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్ పేరు చెప్పి పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేస్తోన్న పాలకులు..మహానగరంలో మౌలిక సదుపాయాల మెరుగుదలను పట్టించుకోవడంలేదు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో గ్రేటర్‌ను అభివృద్ధి చేస్తామన్న ప్రకటనలు తప్ప పద్దులో ఆశించిన మేరకు కేటాయింపులు దక్కలేదు. గత ప్రభుత్వం తరహాలోనే ఈ ప్రభుత్వం కూడా 2024-25 బడ్జెట్‌లోనూ అదే పంథా కొనసాగించింది. విశ్వనగర రూపకల్పనలో కీలకమైన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమాలు, నాలాల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ట్రాఫిక్ చిక్కులకు చెక్..లింక్ రోడ్ల నిర్మాణానికి నిధుల ఊసెత్తలేదు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కాకున్నా కనీసం రాష్ట్ర బడ్జెట్‌లోనైనా జీహెచ్ఎంసికి తగిన కేటాయింపులుంటాయని ఆశించిన వారి అంచనాలు తప్పాయి. గడచిన ఐదేళ్ల మాదిరే ఈసారి సైతం రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసికీ ఆయా ప్రాజెక్టుల పనులకు సంబంధించి ఎలాంటి నిధులు కేటాయించలేదు. నామ్‌కేవాస్తేగా ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో చూపుతు నకప కొన్ని అంకెలు మాత్రం ఉన్నాయి. కేంద్రం నిధుల్వి లేదంటూ విమర్శించిన పాలకులు రాష్ట్ర బడ్జెట్‌లోనైనా భారీ నిధులు వచ్చేలా కృషి చేస్తారనుకున్న వారి అంచనాలు తప్పాయి. పార్లమెంటు ఎన్నికలు జరగనున్నందున ఈ సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లోనైనా జీహెచ్ఎంసికి తగిన నిధులు కేటాయిస్తారని రాజకీయ పరిశీలకులు భావించినప్పటికీ, మూసీ నది మినహా ఏ ఒక్క ప్రాజెక్టుకూ నిధులు కేటాయించలేదు. ఇక జలమండలి, మెట్రో ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధుల ఊసే కనిపించలేదు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయిస్తారని వేయికళ్లతో ఎదురుచూసినా ఫలితం లేకుండా పోయింది. ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటా దక్కకపోవడంతో నగరవాసులు పెదవి విరిచారు.

ఈ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇచ్చింది. అందులో భాగంగానే పెద్దఎత్తున నిధులను ప్రభుత్వం కేటాయించింది. అర్హులైన అందరికి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా, రూ.500లకు గ్యాస్ సిలిండర్ అందజేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మూసీ రివర్ ఫ్రాంట్‌కు రూ.1000 కోట్లు కేటాయించారు. థేమ్స్ నది తరహాలో మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, మూసీ పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పనా జోన్‌గా మారుస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని మూడు జోన్‌లుగా విభజిస్తామని, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని పెరి అర్బన్ జోన్‌గా, ఆర్ఆర్ఆర్ అవల ఉన్న భాగాన్ని గ్రామీణ జోన్‌గా విభజనపై బడ్జెట్ కేటాయింపుల సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది.

## రసపట్టులో బండ్లగూడ కార్పోరేషన్

- కాంగ్రెస్ అండతోనే క్యాంపుకెళ్లిన కార్పోరేటర్లు
- రూ.కోటికి పెరిగిన కార్పోరేటర్ల రేటు
- అవిశ్వాసం నెగ్గి చూపుతామంటున్న 16మంది కార్పొరేటర్లు
- "హస్త"గతం కానున్న బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్

**రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ రాజకీయం రసపట్టుగా మారింది. మేయర్‌కు వ్యతిరేకంగా 16.మంది కార్పోరేటర్లు పార్టీలకు అతీతంగా జట్టు కట్టి 28.రోజులుగా క్యాంపు రాజకీయాలు చేస్తున్నారు. మొదట్లో మేయర్‌పై కోపంతోనే అవిశ్వాసం పెట్టినట్లు అంతా భావించారు. కానీ దీని వెనుకాల అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దల హస్తం ఉన్నట్లు ఆ తరువాత తెలిసింది. ఓ బడా నాయకుడు వీరికి అండగా ఉండి ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డితోనే వ్యవహారం చక్క పెడుతున్నట్లు విశ్వసీనయంగా తెలిసింది. బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ పీఠంను "హస్త" గతం చేసుకునేందుకు కాంగ్రెస్ సీనియర్ నేతలు అన్నీ తామై పావులు కదుపుతున్నట్లు తెలిసింది.**



నార్సింగి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఇన్నాళ్లు గాడ్ ఫాదర్ అనుకున్న ఎమ్మెల్యేనే బెదిరింపులకు దిగడంతో ఇక చేసేది లేక కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సైతం క్యాంపులోని కార్పోరేటర్లు సంసిద్ధులయినట్లు తెలుస్తుంది. అధికార కాంగ్రెస్ పార్టీలో ఉంటేనే ఎమ్మెల్యే అజమాయిషి తమపై ఉండదన్న భావనకు కార్పోరేట్లు వచ్చి, అవిశ్వాసం నెగ్గగానే మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మేయర్ మహేందర్‌గౌడ్‌కు అండగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నిలిచినా ఇక్కడ పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. తొలుత కార్పోరేటర్లను బుజ్జగించినా, సీనియర్ బిఆర్ఎస్ నాయకులను పంపించి రాజీ కుదిర్చే ప్రయత్నం చేసినా, ఆఖరుకు పత్రికా ముఖంగా రాజకీయ భవిషత్తు లేకుండా చేస్తానని హెచ్చరించినా క్యాంపుకెళ్లిన కార్పోరేటర్లు అదరడం లేదు, బెదురడం లేదు. పైపెచ్చు అవిశ్వాసంను నెగ్గి మా సత్తాను నిరూపించుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నేను పెంచి, పెద్ద చేసిన మొక్కలే నా మాట వినడం లేదని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కూడా కార్పోరేటర్ల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు క్యాంపును వీడి వచ్చే కార్పోరేటర్లకు రూ.50.లక్షల నుంచి రూ.కోటి వరకు ఆఫర్ వస్తున్నా ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించడం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి.

**అవిశ్వాసం నెగ్గి చూపుతాం : కార్పోరేటర్లు**

జనవరి 12.వ,తేదీన బండ్లగూడ కార్పోరేషన్‌లోని 16.మంది కార్పోరేటర్లు పార్టీలకు అతీతంగా ఏకమై మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస నోటీసును ఏకంగా జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అటు నుంచి అటే క్యాంపు రాజకీయాలకు తెర లేపారు. నెల రోజులుగా పార్టీలకు అతీతంగా 16.మంది కార్పోరేటర్లు క్యాంపులోనే కొనసాగుతూ వస్తున్నారు. అధికారులు కార్పోరేటర్లందరి సంతకాలు ఒరిజినలా కాదా అని పరీక్షించారు. ఆ తరువాతనే అధికారులు బండ్లగూడ కార్పోరేషన్‌లో ఈ నెల 16.వ,తేదీన అవిశ్వాస తీర్మాణంపై "బల నిరూపణ"కు అవకాశం కల్పించారు. క్యాపులోని కార్పోరేటర్లు అంతా నేరుగా బల నిరూపణ రోజే బయటకు వచ్చి తమ అవిశ్వాసంను నెగ్గించుకుంటామని పేర్కొంటున్నారు.

**రూ.కోటి పలుకుతున్న కార్పోరేటర్ల రేటు :** బండ్లగూడ కార్పోరేషన్‌లోని కార్పోరేటర్ల రేటు ఏకంగా కోటికి చేరినట్లు తెలుస్తుంది. మేయర్‌కు వ్యతిరేకంగా క్యాంపుకు వెళ్లిన కార్పోరేటర్లలో ఎవరు బయటకు వచ్చినా కోటి ఇస్తామన్న ఆఫర్ వచ్చిందిని, అయినా మేము మేయర్‌కు అండగా నిలిచేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఏకపక్ష నిర్ణయాలతో, అనేక అవినీతి పనులు చేస్తూ కార్పోరేటర్లను చిన్న చూపు చూస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్‌ను అవిశ్వాసంలో ఓడిస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా అవిశ్వాసంలోని ఆరుగురు కార్పోరేటర్లను బయటకు లాగాలన్న పట్టుదల మేయర్ వర్గంలో కనిపిస్తుంది. క్యాంపులోని నలుగురు కార్పోరేటర్లు తమవైపున్నారని, మరో ఇద్దరు కూడా బల నిరూపణ సమయంలో మాకు మద్దతుగా నిలిచి అవిశ్వాసంను వీగిపోయాలే చేస్తామన్న విశ్వాసంను మేయర్ వర్గం వ్యక్త పరుస్తుంది. ఏమి జరుగుతుందో మరో ఐదు రోజులు వేచి చూడాల్సిందే మరి.

## అక్రమ నిర్మాణాలు ఆపాలి: గ్రామస్తులు

**త్వరలోనే అక్రమ నిర్మాణాలు కూలుస్తాం : ఆర్డీఓ**



నెక్‌నాంపూర్‌లోని సర్వే నెంబర్ 44.లో అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడ

నార్సింగి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : గండిపేట మండలం నెక్‌నాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమి, చెరువు భూముల్లో కబ్జారాయళ్లు రాత్రింబవళ్లు ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్లు 31,44,లలో వక్ఫ్‌బోర్డు స్థలమంటూ కొందరు వ్యక్తులు వచ్చి పునాదులు తీస్తున్నారని, వెంటనే అడ్డుకోవాలని నాలుగు రోజుల క్రితమే స్థానిక తహసీల్దార్, ఆర్డీఓ, ఇరిగేషన్, పోలీసులకు మేము ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదని కార్పోరేటర్ పద్మారావ్, నాయకులు జయరాజ్, థామోతన్ రావ్, ధన్‌రాజ్‌లు వాపోయారు. అధికారులు కాలయాపన చేస్తూ, పరోక్షంగా కబ్జాకు సహకరించడం వల్లనే ఇప్పుడు 5.ఫీట్ల ప్రహరీగోడలు సైతం వెలిశాయని, గేట్లు కూడా పెట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకే నియమితులైన సంబంధిత అధికార గణం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నెక్‌నాంపూర్ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. సర్వే నెంబర్ 31.లోని 59.ఎకరాల ప్రభుత్వ స్థలం మొత్తం 2002.లోనే సెక్రేటేరియట్ ఉద్యోగులకు కేటాయించిన తరువతా 2006.లో మాకు కూడా 13.ఎకరాలు కేటాయించారంటూ ఓ డాక్యుమెంట్ తెచ్చిన వక్ఫ్‌బోర్డు సభ్యులు ఇప్పుడు సర్వే నెంబర్ 44.లోని చెరువు భూమిలో ప్రహరీగోడ నిర్మిస్తుంటే ఎందుకు అధికారులు అడ్డుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులంతా స్పందించి వెంటనే ఈ కబ్జాలను తొలగించాలని లేదంటే గ్రామస్థులమంతా కుల, మతాలకు అతీతంగా కలిసి ఆందోళన నిర్వహిస్తామని నాయకులు ధన్‌రాజ్ స్పష్టం చేశారు.

**అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం : ఆర్డీఓ**

నెక్‌నాంపూర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయంను రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్య దృష్టికి ప్రభాతవార్త తీసుకెళ్లగా ఆయన స్పందిస్తూ అక్రమ నిర్మాణాల పట్ల ఉపేక్షించేది లేదని, వెంటనే కూల్చి వేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కాపాడి తీరుతామని, ఈ విషయంలో ఎవరికి కొమ్ము కాసేది లేదని తెలిపారు.

## ఉన్నతవర్గానికి చెందిన కోదండరాంరెడ్డిని ఎలా అనుమతిస్తారు

- మాజీ డిజిపి మహేందర్‌రెడ్డిని టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌గా ఆమోదించడం సరికాదు
- గవర్నర్ రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలి : దళితక్రైస్తవ దండోరా రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.గాలి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 10,ప్రభాతవార్త: రాజ్యాంగ బద్దంగా వ్యవహరించాలన్సి గవర్నర్ రాజ్యాంగాన్ని తూట్లు పొడిచేలా వ్యవహరించడం విచారకరమని దళిత క్రైస్తవ దండోరా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గాలివినోద్‌కుమార్ అన్నారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలకు చెందిన దాసోజ్ శ్రావణ్, సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా తిరస్కరించడం తగదన్నారు. తిరస్కరణ సమయంలో సదరు అభ్యర్థులు రాజకీయాలతో సంబంధం ఉండటంతోనే తిరస్కరించినట్లు చెప్పిన గరవ్నర్ అవే రాజకీయాలతో సంబంధం ఉండి ఉన్నతవర్గానికి చెందిన కోదండరాంరెడ్డికి ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. బిసి సామాజిక వర్గానికి చెందిన గవర్నరే ఎంబిసి, ఎరుకల సామాజిక వర్గానికి చెందిన నాయ కులపట్ల ఈ విధంగా వ్యవహరించడం బాధాకర మన్నారు. లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ డిజిపి మహేం దర్‌రెడ్డిని టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌గా ఆమోదించాలని ప్రభుత్వం ప్రతిపాదించగా గవర్నర్ ఆమోదించడం మరింత విస్మయాన్ని కలిగించిందన్నారు. ఈకార్యక్రమంలో అంజన్,పీటర్, పాల్గొన్నారు.

**అడ్డగుట్టలో ఇద్దరు బాలికల అదృశ్యం**



అదృశ్యమైన ప్రసన్న, అక్షిత (ఫైల్‌ఫోటోలు)

2లో



**రసభరితం ముగ్ధమనోహరం నవరస దైవవిలాసం కూచిపూడి నృత్యరూపకం**

దామెర్ల కనకవిజయలక్ష్మి నవరస దైవవిలాసం కూచిపూడి నృత్య రూపకంలో దృశ్యం

3లో

## పుస్తకాల జాతరకు తరలి వస్తున్న అభిమానులు

**విశేషంగా ఆకర్షిస్తున్న హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన**



గద్దర్ పాటలు, మాటలతో కూడిన సంకలనంను ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ, సుద్దాల అశోక్‌తేజ తదితరులు



ముషీరాబాద్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 9వ తేదీ ప్రారంభమయిన 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన 2024ను పుస్తక ప్రియులు విశేషంగా ఆదరిస్తున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహించే ఈ పుస్తక ప్రదర్శన ఈసాపల్లి కృష్ణారావు సైతం పుస్తక ప్రదర్శనను పర్యవేక్షించి, ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రం ఏర్పటిన నాటి నుండి మరింత ఉత్సాహంగా కొనసాగుతున్న ఈ ప్రదర్శనకు గత తెలంగాణ ప్రభుత్వం బాగా సహకరించిందని, అదే విధంగా ఇప్పుడు ఏర్పడిన నూతన ప్రభుత్వం కూడా పుస్తక ప్రదర్శనను ప్రోత్సహిస్తోందని, అన్ని విధాలుగా ప్రభుత్వ సహకారం పుస్తక ప్రదర్శనకు అందుతోందని బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్, కార్యదర్శి ఆర్.వాసు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు: ప్రతి రోజూ సాయంత్రం మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా విద్యార్థులతో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కనుమరుగవుతున్న జానపద కళలకు జీవం

మిగతా సిటీ 3వ పేజీలో



**గద్దర్ యాదిలో:** పీడిత ప్రజల పక్షాన తన జీవిత కాలం పోరాడిన ప్రజా గాయకుడు గద్దర్‌ను స్మరించుకుంటూ శనివారం సాయంత్రం గద్దరన్న యాదిలో అనే కార్యక్రమాన్ని రవ్వా శ్రీహరి వేదికపై నిర్వహించారు. ఈ కార్యక్రమంకు తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, కవి సుద్దాల అశోక్‌తేజ, గాయకులు విమలక్క, గోరేటి వెంకన్న ఏపూరి సోమన్న, ప్రొఫెసర్ కాశీం, ఘంటా చక్రపాణి, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి తదితరులు పాల్గొని గద్దర్‌ను స్మరించుకున్నారు. ప్రతి సంవత్సరం పుస్తక ప్రదర్శనకు వచ్చి, తన మాట, పాటలతో ప్రజలను చైతన్య పరిచే గద్దరన్న ఈ సంవత్సరం మన మధ్య లేకపోవటం బాధాకరమని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాల వారసుడు గద్దర్ భౌతికంగా మనమధ్య లేనప్పటికీ తన పాటలో, మాటలో ఎప్పటికీ నిలిచే ఉంటాడని అన్నారు.







సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన చిత్ర కళా ప్రదర్శనలోని అరుదైన కళా ఖండాలు

## సాలార్‌జంగ్ మ్యూజియంలో అద్భుతమైన చిత్రకళా ప్రదర్శన

చార్మినార్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ సాలార్‌జంగ్ మ్యూజియంలో మాస్టర్ స్ట్రోక్ పేరుతో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శన ఎంతో అద్భుతంగా ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన యాభై మూడు మంది చిత్ర కారులు రూపొందించిన ఎంతో అరుదైన డబ్బై కళాఖండాలను చిత్రకళ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. సుందరమైన కళాఖండాలను తిలకించి పర్యాటకులు ఎంతో అనుభూతికి లోనవుతున్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి,శ్రీ వినాయకుడు, గ్రామీణ ప్రాంతం వాతావరణానికి సంబంధించిన పల్లెటూరు,చెరువులు,ఎద్దుల బండ్లు,మహిళలు చెరువు నుంచి మంచి నీరు తీసుకు వస్తున్న చిత్రాలు.నదీ తీరం ఆనుకుని పట్టణం,అదే విధంగా గ్రామీణ మహిళలు ఇండ్ల అరుగు మీద కూర్చుని సంభాషిస్తున్న కళాఖండాలు చిత్రకళ ప్రదర్శనలో ఉన్నాయి. చిత్రకారులు ఎంతో కష్టపడి వేసిన కళఖండాలను చూడటానికి రెండు కళ్లు చాలవు. సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన చిత్రకళ ప్రదర్శనను శనివారం హైదరాబాద్ ఆర్ట్ సోసైటీ అధ్యక్షులు ఎం.వి.రమణారెడ్డి ప్రారంభించారు. జెఎన్ఎఫ్ఎఎల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుందర్ కుమార్, సాలార్‌జంగ్

మిగతా సిటీ 3వ పేజీలో

## హే మహాత్మ మన్నించూ... వర్ధంతి పూలు వాడిపాయే..!


గాంధీ విగ్రహంవద్ద వేయ కుండా ఉంచిన పూల బుట్టి

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** జెండా వందనాలు, జయంతి,వర్ధంతి వేడుకలు అర్భా టంగా నిర్వహించే మున్సిపల్ అధికారులు కొన్ని సార్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయం పక్కనున్న మహాత్మ గాంధీ విగ్రహం వద్ద జనవరి 26వ తేది గణతంత్రదినోత్సవం సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి పలువురు ప్రజా ప్రతినిధులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు,కార్పొరేటర్లు పాల్గొ ని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. తిరిగి అదే నెల 30వ తేదిన గాంధీజీ వర్ధంతి వచ్చింది. దీంతో ఆ రోజు కూడా వేడుకలు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. కింది స్థాయి సిబ్బందిని ఆదేశించడంతో పూల బుట్ట తెచ్చి గాంధీజీ విగ్రహం వద్ద ఉంచారు. కాని రాత్రి వరకు కూడా నేతలు, అధికారులు గాంధీజీ విగ్రహం వద్దకు రాకపోవడంతో విగ్రహానికి వేసేందుకు తెచ్చిన పూలు అదే విధంగా ఉండిపోయాయి. అప్పటి నుంచి శనివారం రాత్రి వరకు కూడా తెచ్చి న పూల బుట్ట తీయకపోవడంతో ఉన్న చోటే వాడిపోయాయి. మహాత్మగాంధీ విగ్రహం వద్ద చేయాల్సి న వేడుకలపై కూడా అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిం చడంపై పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. దీనిని గమనించిన ఒక వ్యక్తి ఫోటో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. గాంధీజీ వర్ధంతి వేడుకలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పల్లవి పౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం


మందులు అందజేస్తున్న మల్కా కొమరయ్య, కార్పొరేటర్లు శ్రీవాణి, చేతన

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** పల్లవి పౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ సర్కిల్ రామంతాపూర్ డివిజన్ కమాక్షిపురంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మల్కాజిగిరి పార్లమెంట్ నేత మల్కా కొమరయ్య, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు అయుష్మాన్ భారత్ స్పూర్తితో పేద, మధ్య తరగతి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ప్రజలు అధిక సంఖ్య లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురికి మందులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతోజు శ్రీనివాసాచారి, కాలనీ అధ్యక్షుడు దుర్గేష్, ప్రధాన కార్యదర్శి ఉలుగొండ నారాయణదాసు, బిజెపి నేతలు లింగం, సుధ, పల్లవి సంస్థ ప్రతినిధులు డా.రమ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రీస్ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి : సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి


సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సింగరేణి కాలనీ సొసైటీ సభ్యులు

**సైదాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** ఐఎస్‌సదన్‌డివిజన్ సింగరేణి కాలనీలో ని ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ కి చెందిన భూమిని ప్రభుత్వం సభ్యులకు అప్పగించి న్యాయం చేయాలని సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి కోరారు. 1981లో సొసైటీ సభ్యులు ప్రభుత్వం నుండే భూమిని కొను గోలు చేసిన ఇప్పటికీ నిరాశ్రయులు గానే ఉండిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సింగరేణి కాలనీలో సొసైటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు ఏపీ కోఆపరేటివ్ యాక్ట్ ప్రకారం 1976లో ఏర్పడిన తమ సొసైటీ 1981లో సైదాబాద్ సింగ రేణికాలనీలోని 25 ఎకరాల భూమిని ప్రభుత్వం నుండి కొనుగోలు చేసింద న్నారు 1995లో ప్రభుత్వం సొసైటీసభ్యులకు నోటరైజ్డ్ డాక్యుమెంట్లు ఇచ్చిం దని, అదేవిధంగా 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 727 ప్రకారం సింగరేణి కాలనీలోని 25 ఎకరాల భూమిని సొసైటీకి చెందిన 247 మంది సభ్యులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించిందని వివరించారు. కాల క్రమేణా ఆభూమిలో కొందరు పేదలు గుడిసెలు వేసుకున్నారని, ప్రభుత్వంలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ కొనుగోలు చేసిన భూమిని దక్కించుకోకుండానే తమలో కొందరు మృతి చెందారని చాలామంది ఉద్యోగాలనుండి రిటైర్ అయి సొంత ఇల్లు లేక వృద్ధాప్యంలో అద్దె ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. గుడిసె వాసులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించి సొసైటీ సభ్యులకు స్థలాన్ని అప్పగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సొసైటీ కన్వీనర్ కెఎస్‌ఆర్‌మూర్తి, ప్రెసిడెంట్ బాలప్రసాద్, కో కన్వీనర్ ఉదయ్‌చంద్, కోశాధి కారి ఈసి మల్లికార్జునశెట్టి తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బడంగ్‌పేట్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థికి స్పోర్ట్స్ డ్రెస్‌ను అందజేస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** భద్రాది కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోరని అర్జున్ తెలిపారు. గత నెలలో సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్‌లో బడంగ్‌పేట్ జడ్పీహెచ్ఎస్‌కుచెందిన బొల్లు యాదగిరి (6వ తరగతి) 14 యేళ్ల లోపు బాలుర విభాగం నుండి 400 మీటర్ల పోటీలకు, దాసరి గాయత్రీ (7వ తరగతి) 14 యేళ్ల లోపు బాలికల విభాగం నుండి 400 మీటర్ల పోటీలకు, కార్తీక్ (6వ తరగతి) 100 మీటర్ల పోటీలకు 14 సంవత్సరాల లోపు బాలుర విభాగం నుండి ఎంపికయ్యారని ఆయన వివరించారు. ఎంపికైన వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పార్టిసిపేట్ చేస్తారని ఆయన వెల్లడించారు. కాగా ఎంపికైన విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేసి అభినందించారు.

## బాలయోగి స్టేడియంలో మాస్టర్స్ అథ్లెటిక్స్


బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి...

**నేరేడ్‌మెట్ ఫిబ్రవరి10 ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో ఫిబ్రవరి 8 నుండి 11వరకు జరగబోయే 5వ నేషనల్ మాస్టర్ ్స అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2024 కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భగా పలు రాష్ట్రాల నుండి వచ్చి నిర్వహిం చిన మార్చ్ రన్నింగ్ పోటీలను తిలకించారు. పోటీలో ప్రతిభ కనబర్చిన పలువురికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్ఆర్ఐటి చైర్మన్, తెలంగాణ రాష్ట్ర నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షులు మర్రి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఆల్ ఇండియా నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ శర్మ, కార్యదర్శి రాంపాల్ శర్మ, ప్రభు కుమార్, లక్ష్మి, డాక్టర్ విజయేందర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ పాల్గొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత...** నేరేడ్‌మెట్ డివిజన్ ఓల్డ్ నేరేడ్‌మెట్‌కు చెందిన శ్రీలత అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసికు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంజూరైన లక్ష 50 వేల రూపాయలను చెక్కును బాధిత కుటంబ సభ్యులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమన్నారు.

## కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి


ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న గోపాల్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులు

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శనివారం గౌతమ్‌నగర్ డివిజన్ గోపాల్‌నగర్‌కు చెందిన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని బోయినపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలను వివ రించారు. ఈ సందర్భంగా కాలనీవాలసులు తమ కాలనీలలో ఎదుర్కొం టున్న సమస్యలను విని అందుకు స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారు లతో మాట్లాడి గోపాల్‌నగర్‌లో నెలకొన్న మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు గోపాల్‌నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలి పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత మేకల రాముయాదవ్, మల్లేష్‌యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిఎస్ఎన్.రాజు మూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పూడికతీత పనుల పర్యవేక్షణ : కార్పొరేటర్ శ్వేత


పూడికతీత పనులు పరిశీలిస్తున్న కార్పోరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** డి.ఎస్.నగర్‌లో డ్రైనేజీ పూడికతీత పనులను పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ లో నుంచి తీసిన పూడిక ను రోడ్లపై ఉంచకుండా వెంటనే తరలించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ అన్సారి, భాగ్యనగర్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బొమ్మల ప్రశాంత్, చంద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ మహిళలకు ఉచితంగా శిక్షణ


విద్యార్థులకు శిక్షణాతరగతులను నిర్వహిస్తున్న దృశ్యం

**మలక్‌పేట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీవారి ఆధ్వర్యంలో అంబర్‌పేట పరిసర ప్రాంతాలకు చెందిన నిరుద్యో గ మహిళలకు రిటైల్, సేల్ ్స రంగంలో 28 రోజులపాటు ఉచిత శిక్షణ అందిం చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కైఉతెపల్లి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ అనంత రం ఉద్యోగ అవకాశాలతోపాటు ఎన్‌డిసి తరపునుండి సర్టిఫికేట్ అందిస్తున్నా మని తెలిపారు. శిక్షణ సమయంలో విద్యార్థులకు రిటైల్‌తోపాటు ఎంఎస్ ఆఫీస్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తిగలవారు 8886 302224, 8886302244లలో

## గ్రాప్ లింగ్ పోటీల్లో విద్యార్థుల సత్తా


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కోచ్ కృష్ణ

**మలక్‌పేట, ఫిబ్రవరి 10 ప్రభాత వార్త :** తెలంగాణ రాష్ట్రస్థాయి గ్రాప్‌లింగ్ పోటీల్లో మలక్‌పేటకు చెందిన విద్యార్ ్థులు బంగారు, రజత పతకాలను సాధించి తమ సత్తా చాటారు. తెలంగాణ ఓపెన్ గ్రాప్‌లింగ్ ఛాంపియన్ షిప్ పోటీ లనునగరంలోని కూకట్‌పల్లిలో నిర్వహించగా నింబోలిఅడ్డాలోని రా కాం బాట్ స్పోర్ట్స్ అకాడమికి చెందిన దేవాన్‌సింగ్, గణేష్‌సింగ్, అజయ్‌కుమార్‌లుమిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు రజత పతకాలను సాధించారు. కోచ్ ఆది మూల కృష్ణ వారిని ఘనంగా సన్మానించి అభినందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మార్షల్ ఆర్ట్స్‌లో నూతనంగా చేర్చిన గ్రాప్‌లింగ్ క్రీడల కు చక్కటి ఆదరణ లభిస్తుందని, ఈ క్రీడ ఒక రకమైన కుస్తీ పోటీ మాదిరిగా ఉంటుంద న్నారు. గ్రాప్‌లింగ్‌లో తమ విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయ మన్నారు. ప్రతిఒక్కరూ ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే ఎంతగానో దోహదపడుతుందన్నారు.

## కలుషిత జలాలు అరికట్టాలని మల్లికార్జున కాలనీవాసుల ఆందోళన

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ మల్లికార్జుననగర్ కాలనీలో కలుషిత జలాలు అరికట్టాలని కోరుతూ పలువురు కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సత్తిరెడ్డి, రంగారెడ్డి, శ్రీకాంత్ పలువురు మహిళలు మాట్లాడుతూ కాలనీలో రాత్రి వేళ దుర్వాసనలు వస్తు న్నాయని, తార్నాక, నాచారం పారిశ్రామికవాడల నుంచి రంగు, రంగులతో కలుషిత నీటిని కాలువతో వదులుతున్నారని పేర్కొన్నారు. ఒక్కోసారి ఒక్క రంగుతో నీరు కాలువతో వస్తుందని, దీనికి తోడు దోమలు విపరీతంగా పెరిగి పోయి సాయంత్రం 6 గంటలనుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొని ఉంద ని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను కలిసి విన్నవించామని, అధికారులకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపా రు. అదే విధంగా స్థానికంగా ఉంటున్న బోరు నీరు కలుషితం అయ్యిందని, తాగునీటితో సైతం వ్యర్థాలు వస్తున్నాయని పేర్కొన్నారు. నాచారం నుంచి వచ్చే కాలువ పైకప్పు నిర్మించి కాలుష్య వ్యర్థాలు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కలుషిత జలాలు నల్ల చెరువులో కలిసి చెరువు కూడా కలుషితం అవుతుందని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే కాలుష్య నియంత్రణ మండలి, జిహెచ్ఎంసి ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ నేతలు పాల్గొన్నారు.

## నిరుపేద వధువులకు ఉప్పల ఫౌండేషన్ చేయూత

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** నిరుపేద వధువులకు ఉప్పల ఫౌండేషన్ ఎప్పుడు అండగా నిలుస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. కూకట్‌పల్లి, అల్విన్ కాలనీకి చెందిన ప్రసన్నలక్ష్మి, గౌలిపురకి చెందిన నవనీత వివాహం కోసం నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్‌గుప్త క్యాంప్ కార్యాలయంలో ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు, చీర, గాజులు విరాళంగా అంద జేశారు. ఈ కార్యక్రమంలో పెళ్లికూతుర్ల వారి కుటుంబ సభ్యులు, ఐవిఎఫ్ తెలంగాణ యూత్ ప్రెసిడెంట్ కట్ట రవికుమార్‌గుప్త, నాయకులు నాగరాజుగుప్త, శ్రీధర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## 16న కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా కార్మికుల సమ్మె నిర్వహిస్తున్న ఉప్పల్ సిఐటియు కార్యదర్శి జె.వెంకన్న, ఏఐటియుసి కార్యదర్శి జగ్గారెడ్డి, బిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి బి.మారుతీరావు, తిప్పని సంపత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతి ఒక్కరు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జీ ప్రకటిస్తున్నామని, ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. దేశంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చ, రైతు సంఘాలు కలిపి ప్రవేశపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ చేయాలని కోరారు. కార్మికుల సమస్యలపై పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేష్, వెంకట్రావ్, జి.మల్లికార్జున్, దశరద్, ఎల్లయ్య, నాగేశ్వర్‌రావు, సయ్యద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంస్కరణల జాతి పిత పివి : దేప


పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** నూతన ఆర్థిక సంస్కరణలతో దేశం ఆర్థికంగా బలపడేందుకు మాజీ ప్రధానమంత్రి పీవీ.నరసింహారావు చేసిన కృషి చిరస్మరణీయమని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధాని పాములపర్తి వేంకట నరసింహారావుకి భారత దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డును ప్రకటించిన సందర్భంగా శనివారం ఆర్కేపురం డివిజన్ అల్కాపురిలోని పీవీ కాంస్య విగ్రహాన్నికి దేప భాస్కర్‌రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పీవీ అని, సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కిచ్చిన గొప్ప నాయకుడని అన్నారు. పీవీకి భారతరత్న అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే పురం డివిజన్ మాజీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, గట్ల రవీంద్ర, బండి మధుసూదన్‌రావు, నల్లెంకి ధనరాజ్‌గౌడ్, వెంకటేశ్వర్లు, తలాటి రమేష్‌నేత, బొడ్డుపల్లి మహిందర్, జ్ఞానేశ్వర్‌యాదవ్, రాజునాయక్, భాస్కర్‌నాయక్, లక్ష్మి, రేణుక, జ్యోతి పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ ఎస్‌బిఐ బ్యాంకులో వికసిత్‌భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్య సాధనలో ప్రజలే ప్రచారకర్తలని అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకం లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనే గొప్ప లక్ష్యం తో ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని, అభివృద్ధి చెం దిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రావు, నాయకులు శంకరయ్యగౌడ్, రఘురాం నేత, నరసింహారెడ్డి, శరత్ కుమార్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో సెయింట్ ఆన్స్ మొదటి స్థానం


శ్రీనివాసపురంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థులు

**వనస్థలిపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని శ్రీ కృష్ణ మెమో రియల్ యూత్‌వారిచే జరిగిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్‌లో ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ రేస్ విభాగాలలో సెయింట్ ఆన్స్ విద్యార్థులు అత్యున్నత ప్రతిభతో అన్ని విభాగాల్లో మొదటి స్థానంలో గెలిచి ప్రతిభను చాటారు. పిల్లలకు చదు వుతోపాటు క్రీడలు కూడ ప్రాధ్యాన్యత ఇస్తాయని, విద్యార్థుల్లో శారీరకంగా, మానసికంగా ఎదుగుదల వుంటుందని చైర్మన్ కుంట్లూర్ వెంకటేషంగౌడ్ పేర్కొన్నారు. మా యాజమాన్యం చదువుతో పాటు క్రీడలకు కూడ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత సంవత్సరంలో కోనేరు హంపి, పివి సింధు వంటి క్రీడాకారులు దేశానికి బంగారు పథకాలు సాధించి పెట్టారు. వారికి 10 కోట్లు పారితోషికంతో ప్రభుత్వం ప్రోత్సహించింది. తల్లితండ్రులు పిల్లల మా ర్కులే కాంకుడా క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని మనవి చేసారు. ఖోఖోలో కార్తీక్, రాంచరణ్, కబడ్డీలో జశ్వ ంత్, రన్నింగ్‌లో చందన, శ్రావణి, యోగశ్రీ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు రాము, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి ఆసుపత్రి యాజమాన్యం రోడ్డు ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్యలు


కాలనీవాసులతో కలిసి అధికారులను కలిసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** కృష్ణవేణి హాస్పిటల్ యాజమాన్యం రోడ్డు అక్రమించడంవల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని విజిలెన్స్ అండ్ డయస్టర్ మేనేజ్మెంట్ జీహెచ్ఎంసీ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ ఐ.పీ.ఎస్ ప్రకాష్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పలు కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులచే కలిసి మర్యాదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ హయత్‌నగర్ బస్ డిపోకు వెళ్లే దారిని కృష్ణవేణి హాస్పిటల్ యాజమాన్యం కొంతమేర దారి అక్రమించడం జరిగిందని, ఆ దారిలో రెండు బస్ డిపోలు, కోర్టు, కాలేజ్, దాదాపు 14 కాలనీలకు సంబంధించిన దారి ఉందని, రోడ్డు అక్రమించడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్పిటల్ యాజమాన్యాన్ని పిలిపించి కాలనీల ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ప్రకాష్‌రెడ్డి సంబంధించిన హాస్పిటల్ వారిని పిలిపించి వారిచే మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం ఇదే విషయంపై కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి హాస్పిటల్ విషయాన్ని తెలియజేసారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి అధికారుల దగ్గర నుండి నివేదిక తెప్పించుకొని తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ఆస్తి పన్ను వసూళ్లపై మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల ప్రత్యేక దృష్టి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** వచ్చే నెల మార్చి 31వ తేదీ నాటికి 2023-24 ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆస్తి పన్ను వసూళ్ళపై ప్రత్యేక దృష్టి సారించారు. మార్చి నెలాఖరు వరకు ఆస్తి పన్ను బకాయిలు వసూళ్ళు చేయాలని సిడిఎంఎ మున్సిపల్ కారొ ్రేషన్లను ఆదేశించడంతో కమీషనర్లు ఆ దిశగా చర్యలు తీసు కుంటున్నారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గంలోని కీలకమైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తి పన్నులపై వసూళ్ళపై నిమగ్నమైంది. ఇందులో భాగంగా కమీషనర్ వాణిరెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ ఆఫీసర్ అంజన్‌రెడ్డి ఆస్తి పన్ను బకాయిదారుల జాబితాను సిద్ధం చేసి వాటి వసూళ్ళ కు బిల్ కలెక్టర్లకు దిశా నిర్దేశనం చేశారు.

**ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించాలి: కమీషనర్ వాణిరెడ్డి..** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్నుదారులు సకాలంలో చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కమీషనర్ వాణిరెడ్డి కోరారు. మార్చి నెలాఖరు లోపు ఆస్తి పన్నుదారులు, పాత బకాయిదారులు చెల్లించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వంద శాతం ఆస్తి పన్నుల వసూళ్ళకు కార్పొరేషన్ కృషి చేస్తున్నదనీ ఈ మేరకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

## మినీ శిల్పారామంలో దేశభక్తి గీతాలాపన

**ఉప్పల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఎస్‌కెఎస్ కళాక్షేత్రం చైర్మన్ డా.ఎన్‌పి వెంకటాచార్య శిష్య బృందం ఆధ్వర్యంలో భక్తి సంగీతం, దేశ భక్తి గీతాలు అలపించారు. భక్తి సంగీతంలో భాగంగా అన్నమాచార్య, రామదాసు, త్యాగరాజు కృతులు అలపించారు. వీరికి కీ బోర్డుపై రుషి, తబల రాజు, రిదమ్ కృష్ణ, షాడ్స్‌పై సహకరించారు. పరిణిక, సాగున్, తన్వి, నిరంజని, ఇందిరా, నాగమణి, విరాట్, మేధా, హిమాన్వి, రాఘవేంద్ర, కిషోర్ పాల్గొ న్నారు. గురువులు డా.మనోజ్ఞ, జ్యోతిర్మయి, మనోహర్, రామకృష్ణ, డైరెక్టర్ కృష్ణకుమార్ కళాకారులను అభినందించారు. శనివారం సెలవు దినం కావ డంతో సందర్శకుల నుంచి మంచి స్పందని ఉందని నిర్వాహకులు తెలిపారు.

## కమలా ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం

**మలక్‌పేట, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** దిల్‌సుక్‌నగర్‌లోని శ్రేష్ట శ్రీ కమలా ఆసుపత్రి మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలనుండి సాయంత్రం 4 గంటలవరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థో, ఫిజియోథెరఫి, డెంటల్, కాస్మోటా లజీ విభాగాలను సంబంధించి శిబిరాన్ని నిర్వహిస్తున్నాని అన్నారు. ఉచిత వైద్య శిబిరంలో బిఎండి దంత స్కేలింగ్, ఎక్స్‌రే తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతోపాటు ఉచిత వైద్య సంప్రదింపులు అందిస్తున్నామని పేర్కొ న్నారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అపాయింట్‌మెంట్‌కొరకు 040-277661188, 8908901188లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి : లక్ష్మణ్

**హయత్‌నగర్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ పెద్దఅంబర్‌పేట 12వ వార్డు కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 12లోని 2.33 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని తెలిపారు. బోరు వేసి వ్యవసాయం కోసం పనులు ప్రారంభించారు. మరి కొంతమంది వెంచర్ చేసి అమ్మడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. సదరు భూమిలో మున్సిపాలిటీ నిధులతో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు అర్జీ ఇచ్చిన అధికారులు స్పందిచలేదన్నారు. హద్దులు, హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేసి విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణలనుండి కాపాడాలని ఎమ్మార్వోను కోరారు.

## విద్యా రంగంపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలి : పి. శివకుమార్

**తుర్కయాంజాల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన 7.75% నిధులు సరిపోవని 30% నిధులు ఇవ్వాలని, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో 15% నిధులు విద్యకు కేటాయిస్తామని చెప్పారని కనీసం 15% ఇస్తే బాగుండేదని ఏఐఎస్ ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి శివకుమార్ పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలనతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, బడ్జెట్‌లో యూనివర్సి టీలలో మౌలిక సదుపాయాల కోసం కేటాయించిన 500కోట్లు ఏ మేరకు సరిపడావని ప్రతి యూనివర్సిటీకి 300కోట్లనుండి 1000కోట్లనిధులు కేటాయించి ఉన్నత విద్య ప్రమాణాల పెంపు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్స్‌కి సొంత భవనాలతోపాటు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించి విద్యార్థు లకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రాధాన్యత ఇవ్వాలని, ఉద్యోగాల భర్తీకై జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సెయింట్ పీటర్స్ స్కూల్లో ఘనంగా ఫెయిర్ వెల్


విద్యార్థులతో డైరెక్టర్ డా.విద్యాస్రవంతి ఉపాధ్యాయులు

**నాచారం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:** నాచారంలోని సెయింట్ పీటర్స్ మోడల్ స్కూల్లో శనివారం ఘనంగా ఫెయిర్ వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు, 10వ తరగతి విద్యార్థులు 11వ తరగతి విద్యార్థులకు ఫెయిర్‌వెల్ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థు వీడ్కోలు నృత్యం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో స్కూల్ ప్రాంగణం పండుగవాతావరణం నెలకొంది. ఈ వేడుకలకు ప్రముఖ విద్యావేత్త, కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు, స్కూల్ డైరెక్టర్ డా.విద్యా స్రవంతి పాల్గొని మాట్లాడుతూ ఈవెంట్లు నిర్వహిస్తూ పిల్లలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షిఫ్రీతికతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.